# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-08-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆపరేషన్ సిందూర్ భారత సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రపంచానికి తెలియ చేసిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.**
2. **హంద్రీ నీవా ప్రాజెక్టు ద్వారా రాయలసీమ జిల్లాలకు సాగు నీరు అందుతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
3. **జనౌషధి కేంద్రాల ద్వారా నాణ్యమైన ఔషధాలను అందిస్తూ, కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య భద్రత కల్పిస్తోందని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు.**
4. **అమృత్ పథకం ద్వారా దేశంలోని రైల్వేస్టేషన్లను ఆధునీకరిస్తున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు.**
5. **హైదరాబాద్‌లో వరద ముంపును పరిష్కరించేలా ప్రణాళికలు రూపొందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.**

=========================

ఆపరేషన్ సిందూర్ భారత సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రపంచానికి తెలియజేశాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. కర్నాటకలోని బెంగళూరులో మెట్రో మూడో దశ పనులకు నిన్న శంకుస్థాపన చేసి అనంతరం ప్రధానమంత్రి ప్రసంగించారు. పాకిస్థాన్‌లోని కీలక స్థావరాలు, ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేసిన నూతన భారత్ శక్తిసామర్థ్యాలను తెలిపిందని చెప్పారు. ఈ విజయానికి భారత సాంకేతికత , రక్షణ రంగంలో 'మేక్ ఇన్ ఇండియా' పరికరాలు దోహదపడ్డాయని ప్రధానమంత్రి పేర్కొంటూ..

వాయిస్ 27 సెకన్లు

-------------------------

హంద్రీ నీవా ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి రాయలసీమ జిల్లాల్లో 6 లక్షల ఎకరాలకు సాగు నీరు అందుతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ మేరకు హంద్రీ నీవా నుంచి కృష్ణా జలాల విడుదల వీడియోను సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పంచుకున్నారు. పంట పొలాల సాగుకు నీరందేలా, హంద్రీ నీవా కాల్వల్లోని నీటి ప్రవాహాలు రైతుల ఆకాంక్షలను తీరుస్తున్నాయని చెప్పారు. తక్కువ సమయంలోనే కాల్వల విస్తరణ చేపట్టిన కారణంగానే ఈ పంట కాలంలో చివరి భూములకు నీరందించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం జనౌషధి కేంద్రాల ద్వారా నాణ్యమైన ఔషధాలను అందిస్తూ, ఆరోగ్య భద్రత కల్పిస్తోందని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో ప్రధాన మంత్రి భారతీయ జనౌషధి పరియోజన తెలంగాణ మార్కెటింగ్ కమ్ డిస్ట్రిబ్యూషన్ వేర్ హౌస్‌ను కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డితో కలిసి నిన్న ఆయన ప్రారంభించారు. అనంతరం గవర్నర్ ప్రసంగిస్తూ,

వాయిస్ 28..సెకన్లు

---------------------------

హైదరాబాద్‌లో వరద ముంపును పరిష్కరించేలా ప్రణాళికలు రూపొందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని వరద ముంపు ప్రాంతాల్లో ముఖ్యమంత్రి నిన్న ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా భూగర్భ వరద లైన్ల సామర్థ్యాన్ని పెంచాలని, మురుగునీటి పైపులైన్ల వ్యవస్థను పునరుద్ధరించి బస్తీల ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు జూబ్లీహిల్స్, కృష్ణానగర్, యూసుఫ్‌గూడ, మధురానగర్ నుంచి వచ్చే వరద.. రహదారులను, మైత్రివనం కూడలిని, బస్తీలను ముంచెత్తకుండా.. నీరంతా భూగర్భ మార్గంలో వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా భద్రతా చర్యలు చేపడుతున్నామని హోం శాఖ మంత్రి వి.అనిత తెలిపారు. ఏడాది కాలంలో డ్రోన్ పోలీసింగ్, మహిళల భద్రత కోసం శక్తి యాప్, రాష్ట్ర వ్యాప్తంగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశామని ఒక ప్రకటనలో తెలిపారు. పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రాధాన్యత ప్రాతిపదికన దర్యాప్తు చేపడుతున్నామని తెలిపారు. రెండు నుంచి ఆరు నెలల సమయంలోనే న్యాయం వేగంగా అందేలా చూస్తున్నామన్నారు. ప్రజా నమ్మకం, భద్రత, సంక్షేమాన్ని పెంపొందించే ఏకైక లక్ష్యంతో విజిబుల్ పోలీసింగ్, ఇన్విజిబుల్ పోలీసింగ్ పని చేస్తోందని హోం మంత్రి అనిత పేర్కొన్నారు.

---------------------------

'అమృత్' పథకం ద్వారా దేశంలోని రైల్వేస్టేషన్లను కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా తెనాలిలో అమృత్ పథకం రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను మంత్రి గత సాయంత్రం పరిశీలించారు. డిసెంబర్ నాటికి తెనాలి రైల్వే స్టేషన్ మొదటి దశ పూర్తి పనులను పూర్తి చేస్తామని కేంద్ర మంత్రి ఈ సందర్భంగా తెలియజేస్తూ,

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

దేశవ్యాప్తంగా ఐక్యతా భావనను, దేశ భక్తిని పెంపొందించేందుకు "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రజలు తమ ఇళ్ళలో త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేసి సంబంధిత సెల్ఫీలను www.harghartiranga.com వెబ్‌సైట్‌లో పొందుపరచడం, తిరంగా బైక్ ర్యాలీలు, విద్యార్థులకు తిరంగా రంగోలి కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయి. ప్రతి భారతీయునిలో దేశ భక్తి భావనను పెంపొందించడమే లక్ష్యంగా

ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

కాగా.. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో ఈరోజు ఉదయం నిర్వహించే హర్ ఘర్ తిరంగా ర్యాలీ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశా, ఎస్పీ రాజశేఖర్ బాబు, మున్సిపల్ కమీషనర్ ధ్యాన్‌చంద్ర పాల్గొంటారు.

--------------------------

థాయ్ లాండ్‌లోని బ్యాంకాక్‌లో ఆసియా అండర్-19 బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్ పోటీలలో భారత బాక్సర్లు పతకాలను సాధించారు. మహిళల 54 కిలోల విభాగంలో నిషా, 57 కిలోల విభాగంలో ముస్కాన్.. పురుషుల 75 కిలోల విభాగంలో రాహుల్ కుందు పసిడి పతకాలను సాధించారు. మహిళల విభాగంలో భారత్ నుంచి మొత్తం పది మంది పోటీపడగా, తొమ్మిది మంది పతకాలు గెలవడం విశేషం. అలాగే పురుషుల విభాగంలో మౌసమ్ సుహాగ్ , హేమంత్ సంగ్వాన్ రజతాలు, శివమ్, గౌరవ్ కాంస్య పతకాలు గెలుచుకున్నారు.

--------------------------

ఉత్తర ఆంధ్రా కర్ణాటక, దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 4.5 కిలో మీటర్ల మధ్య ఎత్తులో విస్తరించి ఉందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ....

వాయిస్...31 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ ఈరోజు, రేపు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలోని 23 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని రహదారుల, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో వర్షాల పరిస్థితులపై అమరావతి నుంచి మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం వర్షాకాలం దృష్ట్యా రాష్ట్ర వ్యాప్తంగా బలహీనంగా ఉన్న కల్వర్టులు, వంతెనలు, కోతకు గురయ్యే అవకాశమున్న రహదారుల విషయంలో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

====================